టెట్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీటెట్) రాతపరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో జరుగుతాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్‌పర్సన్ ఈ నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటిరోజు ఉదయం పేపర్-2 మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ పేపర్‌ను 53 కేంద్రాల్లో నిర్వహించామని తెలిపారు. 13,131 మందిని కేటాయించగా, 9,513 (72.45 శాతం) మంది హాజరయ్యారని పేర్కొన్నారు. 3,618 (27.55 శాతం) మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం పేపర్-2 మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ పేపర్‌ను 54 కేంద్రాల్లో జరిపామని పేర్కొన్నారు. 13,230 మందిని కేటాయిస్తే 9,605 (72.6 శాతం) మంది పరీక్ష రాశారని వివరించారు. 3,625 (27.4 శాతం) మంది గైర్హాజరయ్యారని తెలిపారు. గురువారం ఉదయం 52 కేంద్రాల్లో, మధ్యాహ్నం 50 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

21న జెఎన్‌టియుహెచ్‌లో ఎప్‌సెట్‌పై అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్)పై ఈనెల 21వ తేదీన ఉదయం పది గంటల నుంచి హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జెఎన్‌టియుహెచ్‌లో అవగాహన కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ ప్రవేశాల గురించి విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, జేఎన్టీయూహెచ్ వీసీ టి కిషన్‌కుమార్‌రెడ్డి, రెక్టార్ కె విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ జివి నరసింహారెడ్డి, ఎప్‌సెట్ క్యాంప్ అధికారి బి శ్రీనివాస్ పాల్గొంటారని వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎప్‌సెట్ ఇంజనీరింగ్ విభాగానికి 2,20,326 మంది దరఖాస్తు చేస్తే, 2,07,190 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వారిలో 1,51,779 (73.26 శాతం) మంది అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించి 86,762 మంది దరఖాస్తు చేయగా, 81,198 మంది పరీక్ష రాశారు. వారిలో 71,309 (87.82 శాతం) మంది అర్హత పొందారు.

ధనిక పెట్టుబడిదారులకు పోటీగా మహిళలు



ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి తదితరులు

- మాది వినూత్న ఆవిష్కరణల ప్రభుత్వం
- గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి
- విద్యార్థుల్లో నైపుణ్యం కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణ రైజింగ్‌లో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని మహిళలు ధనిక పెట్టుబడిదారులకు పోటీదారులుగా మారుతున్నారని తెలిపారు. ప్రభుత్వంలో నూతన ఆవిష్కరణలు, విధానాలు తీసుకొచ్చామని చెప్పారు. హైదరాబాద్‌లో బుధవారం గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్‌ను (జిఎస్‌ఇసి) ప్రారంభించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ డిజిటల్ భద్రతే లక్ష్యంగా ఆసియా పసిఫిక్ ప్రాంతంలో గూగుల్ ఏర్పాటు చేసిన మొదటి జిపిఇసిని ప్రారంభించడం తనకు సంతోషంగా ఉందన్నారు. ఇది ప్రపంచంలో ఐదవది కావడం విశేషమన్నారు. ఈ కేంద్రం ఉపాధిని సృష్టించడంతోపాటు దేశం సైబర్ భద్రతా సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. గూగుల్ ప్రారంభించినప్పటి నుంచి ప్రపంచం మారిపోయిందని సిఎం అన్నారు. గోప్యత, భద్రత గురించి నేడు ఆందోళన చెందుతున్నామన్నారు. మన ఆర్థిక వ్యవస్థ, మన ప్రభుత్వం, మన జీవితాలు డిజిటల్‌గా మారాయని పేర్కొన్నారు. డిజిటల్ సమాచారం భద్రంగా ఉంటే ప్రజలు క్షేమంగా ఉన్నట్లే అని చెప్పారు. గూగుల్ ఇన్నోవేటివ్ కంపెనీ అయితే.. తమది ఇన్నోవేటివ్ (వినూత్న) ప్రభుత్వమన్నారు. గూగుల్ లాగా, తమ ప్రభుత్వం కూడా మంచిని మాత్రమే చేస్తుందని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు కోసం ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని సిఎం తెలిపారు. ఉత్తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ మారుతోందన్నారు. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ మారనుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్థలు ఉత్తమ పెట్టుబడి అనుకూల రాష్ట్రం కోసం శోధిస్తే అది తెలంగాణనే అవుతుందని ఖచ్చితంగా చెబుతున్నానని పేర్కొన్నారు.

తెలంగాణ ఎథికల్ ఇన్నోవేషన్‌లో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ టార్చ్ బేరర్‌గా దిశా నిర్దేశం చేస్తుందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు అన్నారు. 2024-25లో హైదరాబాద్ నుంచి రూ.2.68 లక్షల విలువైన ఐటి, ఐటి ఆధారిత సేవలు ఎగుమతి అయ్యాయన్నారు. 40వేల మందికి కొత్తగా ఐటి ఉద్యోగాలు లభించాయన్నారు. అంతర్జాతీయ టాప్ 10 టెక్ దిగ్గజ కంపెనీల్లో 7 ఇక్కడ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాయని తెలిపారు.

విస్తరణకు హైదరాబాద్‌ను ఎంచుకోండి

- బ్రహ్మోస్ ఏరోస్పేస్‌ను కోరిన సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంస్థ విస్తరణకు హైదరాబాద్‌ను ఎంచుకోవాలనీ బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధులను సిఎం రేవంత్ రెడ్డి కోరారు. సిఎం సూచనకు బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. బుధవారం హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని సిఎం నివాసంలో ఆయనను బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండి, సిఇఒ డాక్టర్ జైతీర్థ్ ఆర్ జోషి, బ్రహ్మోస్ హైదరాబాద్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సూరంపూడి సాంబశివ ప్రసాద్, డిఆర్‌డిఎల్ డైరెక్టర్ జిఎ శ్రీనివాస మూర్తి, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి వారితో ప్రభుత్వం వైపు నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. హైదరాబాద్, బెంగుళూరు డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు చేసేందుకు అనుకూలమైనవని సిఎం వివరించారు. ఇప్పటికే హైదరాబాద్‌లో డిఫెన్స్‌కు సంబంధించి వివిధ సంస్థలు ఉన్నాయని చెప్పారు. దేశంలో పెట్టుబడులకు తెలంగాణ అనుకూల ప్రదేశమని తెలియజేశారు. ఈ సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

కార్మికవర్గంపై తీవ్రమవుతున్న దాడి

- ప్రతిఘటించేందుకే జులై 9న దేశవ్యాప్త సమ్మె
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికవర్గంపై తీవ్రమవుతున్న దాడిని ప్రతిఘటించేందుకే జులై 9న దేశవ్యాప్త సమ్మె అని, ప్రతి ఒక్కరూ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సార్వత్రిక సమ్మె బుక్‌లెట్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ఎన్‌డిఎ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ విధానాలతో దేశంలో కార్మికవర్గంపై దాడి తీవ్రమైందని తెలిపారు. దేశంలో సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితులు దిగజారుతున్నాయని, సమాజంలో అసమానతలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరి చేతుల్లోనే సంపద కేంద్రీకరణ కావడమే దీనికి కారణమని చెప్పారు. ఇది దేశంలో సంక్షోభానికి దారితీస్తుందని హెచ్చరించారు. ప్రస్తుతం అమెరికా అధ్యక్షులు ట్రంప్ ప్రేలాపనలు, టారిఫ్‌ల పెంపులు కూడా పెట్టుబడిదారీ విధాన సంక్షోభంలో భాగమేనని స్పష్టం చేశారు. ఇతర దేశాల సరుకులపై పన్నుల భారం మోపం ద్వారా తన సంక్షోభాన్ని తప్పించుకునే పనిలో అమెరికా ఉందని అన్నారు. కార్పొరేట్లకు మరిన్ని లాభాలు కట్టబెట్టేందుకే మోడీ సర్కారు లేబర్ కోడ్‌లను తీసుకురావడం కారణమని తెలిపారు. వాటిని ప్రతిఘటించకపోతే దేశ కార్మికోద్యమ ఉనికే ప్రమాదమని తెలిపారు. ఈనేపథ్యంలో చేసే సార్వత్రిక సమ్మె జయప్రదం కోసం క్యాంపెయిన్‌ను క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ, జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, నాయకులు శంకర్ గౌడ్, జంగం గంగాధర్, నన్నేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఎకరాల వరకు రైతు భరోసా

- ఇప్పటి వరకు 58 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ: మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం వానాకాలానికి ఇస్తున్న రైతు భరోసా పథకం కొనసాగుతున్నది. మూడో రోజు నాలుగు ఎకరాలున్న రైతులకు రూ.1,313.53 కోట్లు విడుదల చేసింది. ఈమేరకు బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుభరోసా పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమ చేసిందని తెలిపారు. దీంతో 21.89 లక్షల ఎకరాలున్న 6.33 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరుతున్నదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం రైతు భరోసా నిధులు రూ.5215.26 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. తద్వారా 58.04 లక్షల మంది రైతులకు సాయం అందించామని పేర్కొన్నారు. రూ. తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామంటూ సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీమేరకు వరుసగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్టు తెలిపారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు ఈ సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. రైతుభరోసా విషయంలో బిఆర్ఎస్ నాయకులకు తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా తొమ్మిది రోజుల్లో రైతుభరోసా సహాయం పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు ఆత్మ విమర్శ చేసుకుని ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. లేదంటే రైతాంగం ఎప్పటికీ బీఆర్ఎస్ నేతలను క్షమించబోదని హెచ్చరించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక సందర్భంలో మినహా వానాకాలం రైతుబంధు సహాయం ఎప్పుడూ సాగు కాలానికి ముందుగా ఇవ్వలేకపోయిందని గుర్తు చేశారు. ప్రతిసారి ఆలస్యంగా రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లోకి జమ చేసిందని తెలిపారు. రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ. ఐదు వేల నుంచి రూ. ఆరు వేలకు పెట్టుబడి సహాయం పెంచి రైతులకు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇవ్వాల్సిన యాసంగి సీజన్ సంబంధించిన రైతుబంధు నిధులు ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం వదిలేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ నిధులను కూడా చెల్లించామని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే దాదాపు రూ.77,000 కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు పెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణయేనని మంత్రి స్పష్టం చేశారు.

విద్యుత్ ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె నాగేశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జెఎసి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద సభ నిర్వహించారు. జేఏసీ చైర్మెన్ కె.ఈశ్వర్‌రావు అధ్యక్షత వహించిన ఈ సభలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ.. టిజిఎస్‌పిడిసిఎల్, టిజిఎన్‌పిడిసిఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కో తదితర విద్యుత్ సంస్థల్లో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 20 వేలమంది ఆర్టిజన్ కార్మికులు సేవలందిస్తున్నారని తెలిపారు. వారందరినీ వారి విద్యార్హతలను బట్టి జూనియర్ లైన్‌మెన్, సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్, సబార్డినేట్ పోస్టులకు కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. కన్వర్షన్ చేయడం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఎలాంటి అదనపు ఆర్థిక భారమూ పడదని తెలిపారు.

అభివాదం తెలుపుతున్న ప్రొ నాగేశ్వర్, జెఎసి నాయకులు

విద్యార్హతలను బట్టి పోస్టుల్లో భర్తీ చేయాలి: పాలడుగు

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కను కలిసి తమగోడు వినిపించినప్పటికీ పట్టించుకోకపోవడం దుర్మార్గమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యుత్ ఆర్టిజన్స్‌ను వారి విద్యార్హతలను బట్టి సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

లేనిపక్షంలో విద్యుత్ కార్మికులతో పెట్టుకున్న గత ప్రభుత్వాల గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20వేల మంది ఉద్యోగులు సమ్మెకు వెళ్తారని తెలిపారు. ఈ సభలో కన్వీనర్ ఎం వజీర్, కో చైర్మన్ జి నాగరాజు, సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, కె లింగం, రఘునాథరెడ్డి, జెఎసి నేతలు రాఘవేందర్‌రెడ్డి, కోటిగౌడ్, సలీం పాషా, కె వెంకటేష్, ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ మారణహోమాన్ని అపాలి

- పాలస్తీనా సంఘీభావ దినాన్ని జయప్రదం చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇజ్రాయిల్ మారణహోమాన్ని అపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. భారత ప్రభుత్వం పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని, ఇజ్రాయిల్‌తో అన్ని సైనిక, భద్రతా సహకారాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బుధవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 నెలలుగా గాజాలో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ నిరంతర బాంబు, వైమానిక దాడులకు పాల్పడుతున్నదన్నారు. మారణహోమాన్ని సృష్టిస్తూ యుద్ధానికి పూనుకున్నదన్నారు. ఇప్పటికే దాదాపు 50వేల మంది మృతిచెందారని తెలిపారు. ఐక్యరాజ్య సమితితో పాటు, ప్రపంచవ్యాపితంగా ఈ దుశ్చర్యను వ్యతిరేకిస్తున్నా, అమెరికా దాని కొన్ని మిత్రదేశాల మద్దతుతో ఇది కొనసాగిస్తుందన్నారు. దాంతోపాటు ఇటీవల ఇరాన్‌పై సైతం యుద్ధాన్ని ప్రకటించి భీభత్సం సృష్టిస్తున్నదన్నారు. అంతర్జాతీయ చట్టం, మానవహక్కులు కాలరాస్తున్నదని తెలిపారు.

ఈ దురహంకార మారణహోమ యుద్ధాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో పాలస్తీనాకు సంఘీభావంగా కార్యక్రమాలు నిర్వహించాలని అఖిల భారత వామపక్ష పార్టీలు పిలుపు మేరకు వామపక్ష పార్టీలు, ప్రపంచశాంతిని కోరుకునే ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఈ నెల 19న సంఘీభావంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు, ప్రజాతంత్రవాదులు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె భాస్కర్, దుబ్బాక రాంచందర్, బి సామేల్, చంద్రమోహన్, జి కవిత, జగదీష్, కె జగన్, ఈ. నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు రూ.8 వేల కోట్లు విడుదల చేయాలి

- టోకెన్లు ఇచ్చిన రూ. 2 వేల కోట్లు ఈ నెలలో చెల్లించాలి
- ఎఫ్ఎటిహెచ్ఇ చైర్మన్ రమేష్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.ఎనిమిది వేల కోట్ల వరకు ఉన్నాయనీ, వాటిని వెంటనే విడుదల చేయాలని ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఎటిహెచ్ఇ) చైర్మన్ నిమ్మటూరి రమేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాటిలో ఆర్థిక శాఖ టోకెన్లు ఇచ్చిన నిధులు రూ.రెండు వేల కోట్లున్నాయనీ, వాటిని ఈ నెలలోనే చెల్లించాలని కోరారు. వారంరోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోరతామనీ, కలిసిన తర్వాత ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని తమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఎటిహెచ్ఇ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యాసంవత్సరం నుంచి ఉన్న బకాయిలను మూడు నెలల్లో విడుదల చేయాలని కోరారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజు బకాయిలను ఆరు నెలల్లో చెల్లించాలని అన్నారు. 2025-26 విద్యాసంవత్సరం నుంచి నాలుగు విడతల్లో ఫీజులను ఇవ్వాలని సూచించారు. ఫీజు బకాయిలను చెల్లించాలని కోరుతూ మంత్రులు, అధికారులను కలిసి వినతిపత్రాలను సమర్పిస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, విద్యార్థులను కలిసి మద్దతు ఇవ్వాలని కోరతామని వివరించారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. అందుకే విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. రైతులు, కాంట్రాక్టర్లకు డబ్బులిస్తున్నారనీ, కాలేజీలున్నాయనే సంగతి ప్రభుత్వం మరిచిపోయిందని చెప్పారు. అన్యాయం జరిగినపుడు న్యాయం కోసం కాలేజీలు కోర్టును ఆశ్రయిస్తాయని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని కాలేజీలు వెళ్తాయన్నారు.

ఎఫ్ఎటిహెచ్ఇ నూతన కమిటీ ఎన్నిక

ఎఫ్ఎటిహెచ్ఇ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా నిమ్మటూరి రమేష్‌బాబు, సెక్రెటరీ జనరల్‌గా కోటల శంకరప్ప రవికుమార్, కోశాధికారిగా కొడాలి కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కాటం సునీల్‌కుమార్, వైస్ చైర్మన్లుగా అల్జాపూర్ శ్రీనివాస్, తుమ్మ జైపాల్‌రెడ్డి, ఎస్ పరమేశ్వర్‌రెడ్డి, రేపాక ప్రదీప్‌రెడ్డి, చలసాని సాంబశివరావు, నీల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులుగా గుర్రం నాగయ్య, ముద్దసాని రమేష్‌రెడ్డి, పుల్లా రమేష్‌బాబు, గోపగాని వెంకట నారాయణ, శ్రీనివాస్ ఆచార్య తాడూరి, మహమ్మద్ గౌస్ మొయినుద్దీన్‌తోపాటు మీడియా కార్యదర్శులు, జాయింట్ సెక్రెటరీలు, ఆర్థిక కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా 14 మంది ఎన్నికయ్యారు.

ఊరికో బస్సు.. ఇంటికో దీపం..

- నినాదంతో మా ప్రభుత్వం ముందుకు పోతోంది
- మహిళల ఉచిత బస్సు ప్రయాణాలకు రూ.6,210 కోట్లు చెల్లించాం
- మధిర బస్ స్టాండ్ శంకుస్థాపన సభలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ఊరికో బస్సు, ఇంటికో దీపం.." నినాదంతో ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి కాలం నుంచి ఇప్పటి ప్రజాప్రభుత్వ పాలన వరకు రాష్ట్రంలో అభివృద్ధికి బాటలు వేశామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా మధిరలో రూ.10 కోట్లతో నిర్మించనున్న కొత్త బస్టాండ్ పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం 10 కొత్త బస్సులను ప్రారంభించారు. ముందుగా బోనకల్ మండలం జానకీపురం సబ్ స్టేషన్‌లో ఆర్‌టీఎఫ్ఎంఎస్, ఎఫ్‌పీఐ వ్యవస్థలను ప్రారంభించారు. అనంతరం మధిరలో ఏర్పాటు చేసిన సభలో భట్టి మాట్లాడారు. ఊరికో బస్సు నినాదంతో రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని, ఇంటికో దీపం పేరుతో ప్రతి ఇంట్లో విద్యుత్ వెలుగులు విరజిమ్మాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఈ పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఆర్టీసీని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. నిజంగా ప్రజల పట్ల నిబద్ధత, ఆలోచన ఉన్నవారే ప్రజలకు మేలు జరిగే సౌకర్యాలు కల్పిస్తారని, అందుకే రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన టీజీఎస్ఆర్టీసీ నిలదొక్కుకొని లాభాల బాట పట్టించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ నిత్యం కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళలను గౌరవించుకునేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించామన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో మహిళలకు 186 కోట్ల జీరో టికెట్లు జారీ చేయగా రూ.6,250 కోట్లు ఆర్థిక శాఖ ఆర్టీసీకి చెల్లించాల్సి ఉండగా ఇందులో ఇప్పటికే రూ.6,210 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. ఆర్టీసీకి ఆదాయం కల్పించామన్నారు.

బ్యాటరీతో నడిచే 600 బస్సులను మహిళా సంఘాలకు ఇచ్చామని తెలిపారు. ఆర్టీసీ సంస్థ భవనాలపై సోలార్ ఉత్పత్తికి ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బస్సులు, బస్టాండ్ల ఆధునికీకరణ జరుగుతున్నాయని తెలిపారు. మధిర బస్టాండ్ పరిసరాల్లో నీళ్లు నిలబడుతున్నాయని చెప్పగానే రవాణా శాఖ మంత్రి నివేదిక తెప్పించుకొని ఆర్టీసీ బోర్డులో ప్రవేశపెట్టిరూ.10 కోట్లు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. మధిరలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులు జరుగుతున్నాయని, ఆర్టీసీ డిపో డ్రయినేజీని వాటికి అనుసంధానం చేయాలని సూచించారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్తు సరఫరా జరుగుతుందని అన్నారు. ఒకవేళ విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెనువెంటనే గుర్తించి మరమ్మతులు చేసేందుకు రియల్ టైం ఫీడర్ మేనేజ్‌మెంట్ సిస్టం (టీఆర్ఎఫ్ఎంఎస్), ఫాల్ట్ పాస్ ఏజ్ ఇండికేటర్స్ (ఎఫ్‌పీఐ) ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఆధునిక పరిజ్ఞానాన్ని ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్.. సంస్థల పరిధిలోని డాష్ బోర్డు ద్వారా రాష్ట్రంలో ఎక్కడ విద్యుత్ సమస్య ఏర్పడినా గుర్తించే అవకాశం ఈ ఆధునిక వ్యవస్థల ద్వారా వీలవుతుందని తెలిపారు.

ఇజ్రాయెల్‌లో జగిత్యాల వాసి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం వల్ల జగిత్యాలకు చెందిన రవీందర్ అనే వ్యక్తి మృతి చెందారు. బతుకుదెరువు కోసం రెండేళ్ల క్రితం అతడు ఇజ్రాయెల్ వెళ్లారు. ఇరుదేశాల మధ్య భీకర దాడులు జరుగుతుండగా.. బాంబుల శబ్దం వల్ల రవీందర్ గుండెపోటుతో మృతి చెందారు. ఈ సమాచారం కుటుంబసభ్యులకు చేరడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

IN THE COURT OF THE HON'BLE
II SENIOR CIVIL JUDGE, CITY
CIVIL COURT : AT : HYDERABAD
OS No. 293 of 2019

BETWEEN :
M/s. ICICI Bank Limited ...Plaintiff
AND
NISCHAY KUMAR AGARWAL
To,
NISCHAY KUMAR AGARWAL
S/o Rajendra Kumar Agarwal
Age Major, Occ: Private Employee
H.No. 11-8-51/54, PG Road,
Venkatrao Nagar Colony, Raogopal
pet, Hyderabad-03 ...Defendant

Please take Notice that the above OS No. 293 of 2019 is stand posted to 10.07.2025 at 10.30 AM for your appearance. You are here by directed by the Hon'ble court to appear before the said court on the date and time mentioned above. If you fail to appear, then the matter will be heard in your absence.

(By ORDER OF THE COURT)
B. PRAVEEN KUMAR.
Hyderabad.
13.06.2024

డాక్టర్ కారులో గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ కారులో గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటన వికారాబాద్ జిల్లాలో మంగళవారం రాత్రి జరిగింది. సిఐ భీమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎంఆర్పీ చౌరస్తాలో రాత్రి 9.30 గంటలకు పోలీసులు విధి నిర్వహణలో భాగంగా వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో ఓ ప్రయివేటు ఆస్పత్రి నడుపుతున్న డాక్టర్ ప్రదీప్‌గౌడ్ ఫార్చునర్ వాహనంలో 65 గ్రాముల గంజాయితో పట్టుబడ్డారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ తెలిపారు.

ఎసిబికి చిక్కిన మహబూబాబాద్ విద్యుత్ శాఖ ఎస్‌ఇ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రూ.80 వేలు లంచం తీసుకుంటూ మహబూబాబాద్ విద్యుత్ శాఖ ఎస్ఇ నరేశ్ బుధవారం ఎసిబికి పట్టుబడ్డారు. ఎసిబి డిఎస్‌పి సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌కు చెందిన ఎన్‌పిడిసిఎల్ కాంట్రాక్టర్.. మహబూబాబాద్, కురవి మండలాల్లో ఎన్‌పిడిసిఎల్ సంస్థలో మరమ్మతులు చేయడానికి కాంట్రాక్టు కుదుర్చుకున్నారు. కాగా అతనికి రూ.20 లక్షలు చేసే పనులకు మాత్రమే లైసెన్స్ ఉంది. కానీ, అతను రూ.20 లక్షలకుపైగా పనులు చేశారు. దాంతో బిల్లులు పొందడం కోసం లైసెన్స్‌ను రూ.20 లక్షలకు పైగా ఎక్స్‌టెన్షన్ చేయడం కోసం ఫైల్ పెట్టుకున్నారు. ఈ ఫైల్‌ని ఎఇ, ఎడిఇ, డిఇ అప్రూవల్ చేశారు. కానీ ఎస్ఈ వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉంది. ఆ ఫైల్ క్లియర్ చేయడానికి ఎస్ఈ నరేశ్ కాంట్రాక్టర్‌ను రూ.లక్ష లంచం అడిగారు. తాను అంత ఇచ్చుకోలేనని ఎన్నిసార్లు బతిమాలినా వినిపించుకోలేదు. దాంతో ఈ నెల 14వ తేదీన రూ.20 వేలు చెల్లించినప్పటికీ ఇంకా రూ.80,000 ఇవ్వాలని ఒత్తిడి చేశారు. దాంతో సదరు కాంట్రాక్టర్ ఎసిబి అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు మహబూబాబాద్‌లోని హస్తినాపురంలో ఎస్ఒ ఇంటివద్ద రూ.80 వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు ఎస్ఇని ఎసిబి అధికారులు అరెస్ట్ చేసి హైదరాబాద్ తరలించారు.

దుర్భర స్థితిలో సాగర్ ఎడమ కాల్వ

- కోతలకు గురవుతున్న కాలువ కట్టలు
- నీరు విడుదల చేస్తే తెగిపోయే ప్రమాదం..: జూలకంటి
- కాల్వ కట్టలను పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాల్వలోకి దిగి ఆయా కట్టలను పరిశీలిస్తున్న జూలకంటి తదితరులు

'అయ్యా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి గారు.. సాగర్ ఎడమ కాలువల దుస్థితిని ఒక్కసారి అధికారులతో కలిసి పరిశీలించండి.. కాలువ కట్టలకు లైనింగ్ లేక కోతలకు గురవుతున్నాయి.. అనేక చోట్ల బుంగలు పడి ప్రమాదకరంగా ఉన్నాయి.. ఈ వానాకాలం సీజన్‌లో నీటిని విడుదల చేస్తే కాల్వ కట్టలు తెగి పంట పొలాలతో పాటు అనేక గ్రామాలు మునిగిపోయే ప్రమాదం ఉంది' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. 'ఆయకట్టు ప్రాంతానికి చెందిన వారిగా భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న మీరు నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి ఒక్కసారి కాల్వ కట్టలను పరిశీలించండి..' అని కోరారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని దొండవారిగూడెం బ్రిడ్జి మైల్ 41 వద్ద కోతలకు గురవుతున్న కాల్వ కట్టలను బుధవారం సిపిఎం నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ సాగర్ నుంచి ఖమ్మం జిల్లా పాలేరు వరకు 179 కిలోమీటర్లు విస్తరించి ఉందని తెలిపారు. గతంలో ఎడమ కాల్వ కట్టలకు లైనింగ్ ఏర్పాటు చేశారని, అక్కడక్కడా సిసి లైనింగ్ ఏర్పాటు చేయకుండా వదిలేశారని తెలిపారు. ప్రతి 10 నుంచి 15 కిలోమీటర్లలోపు అనేక చోట్ల కాల్వ కట్టలు బలహీనంగా ఉండి కోతకు గురవుతున్నాయని అన్నారు. కాల్వ కట్టలు పూర్తిగా తెగిపోయే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. వానాకాలం రాబోతుందని ఆగస్టులో సాగునీరు విడుదల చేస్తే కాలువ కట్టలు పూర్తిగా తెగే అవకాశం ఉందని చెప్పారు. దీనివల్ల పంట పొలాలతో పాటు అనేక గ్రామాలు నీటిలో మునుగుతాయని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలవ కింద కిష్టాపురం, వజిరాబాద్, ముది మాణిక్యం, ములకల కాల్వ, జాన్‌పాడ్, మేజర్లు ఉన్నాయని, అవి ఎన్నో ఏండ్లుగా మరుమ్మతులకు నోచుకోవడం లేదన్నారు. ఇటీవల సాగునీటి ప్రాజెక్టులపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబంధిత అధికారులతో మిర్యాలగూడలో సమావేశం జరిపిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కాల్వకట్టల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఇటీవల మిర్యాలగూడలో జరిగిన ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలోనూ కాల్వల మరమ్మతులకు త్వరలో నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారని, కానీ ఇప్పటివరకు నిధులు మంజూరు చేయలేదని అన్నారు. సాగునీరు విడుదల చేసేందుకు మరో నెల 15 రోజులు గడువు ఉందని, ఆ లోపు కాలువ కట్టలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవి నాయక్, రైతు సంఘం జిల్లా నాయకులు పాదూరీ శశిధర్ రెడ్డి, జిల్లా నాయకులు డా మల్లు గౌతమ్ రెడ్డి, నాయకులు బొగ్గరపు కృష్ణయ్య, రేమిడాల బిక్షం, వలమల్ల ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

ఒబిసి రిజర్వేషన్ల అమలుకు చర్యలు చేపట్టాలి

- ధర్నాచౌక్ వద్ద మహా దీక్షలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒబిసి రిజర్వేషన్లు 42 శాతం తక్షణ అమలుకు యుద్ధ కార్యాచరణ చర్యలు చేపట్టాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మహా దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ.. ప్రధాని మోడీ బిసిలను మోసం చేస్తున్నారని, రాహుల్ గాంధీ ఒసి అయినప్పటికీ బిసిల కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. 2029 జనరల్ అసెంబ్లీ ఎన్నికల లోపు కులాల వారీగా జనగణన పూర్తి చేయాలని, కులగణన ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోకపోతే శ్రీలంక, బంగ్లాదేశ్ మాదిరిగా ప్రజలు తరిమి కొడతారని హెచ్చరించారు. ఎంపి ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. రిజర్వేషన్ల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ కార్యాచరణ చేపట్టాలని లేకుంటే, రాష్ట్రవ్యాప్త దీక్షలు చేపడుతామని అన్నారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ లబ్ది కోసం కాకుండా బిసిల ప్రధాన డిమాండ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరి, కేంద్ర ప్రభుత్వ రాజకీయ లబ్ది వైఖరి తక్షణమే విడనాడాలని, లేనిపక్షంలో తాము చేపట్టే ఉద్యమ కార్యాచరణ, ప్రజాభిప్రాయానికి బాధ్యులవుతారని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పాత పద్ధతిలోనే స్థానిక ఎన్నికలకు పోదామని ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ హనుమంతరావు, కాంగ్రెస్ సీనియర్ నేత వినయ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, విద్యా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ, నందగోపాల్ సుధాకర్, జగదీష్ యాదవ్, సతీష్, వంశీకృష్ణ, ఉదయ్, నరహరి, నాగుల శ్రీనివాస్, చెన్నా రాములు, సరోజా రజిని, విమల, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఐఎంటిలో మేనేజ్‌మెంట్ ఓరియంటేషన్ ప్రోగ్రాం ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ (ఐఎంటి) హైదరాబాద్‌లో అభ్యుదయం 2025 పేరిట మేనేజ్‌మెంట్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ కార్యక్రమం ప్రారంభానికి టిసిఎస్ హైదరాబాద్ హెడ్ చల్లా నాగ్, ఎలికో లిమిటెడ్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ వనితా దట్ల, ఐఎంటి హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) బహరుల్ ఇస్లాం హాజరయ్యారు. 2025-27 బ్యాచ్‌ను ప్రారంభించామని బహరుల్ ఇస్లాం తెలిపారు. క్రమశిక్షణ ప్రోత్సహించడమే కాకుండా ఆశించబడుతుందన్న అయన వృత్తిపరమైన ప్రవర్తన, విద్యా నైపుణ్యానికి పునాది వేస్తుందని పేర్కొన్నారు.

ఉచిత ఆటో పర్మిట్లను అడ్డుకుంటే తాటతీస్తాం

- ఆటో డ్రైవర్లను దోపిడీ చేస్తున్న ఫైనాన్సియర్లు
- రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జెఎసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జెఎసి నాయకులు

జిహెచ్‌ఎంసి, ఒఆర్ఆర్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసే ఉచిత ఆటో పర్మిట్లను ప్రయివేటు ఆటో ఫైనాన్సియర్లు అడ్డుకుంటే తాటతీస్తామని తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జేఏసీ హెచ్చరించింది. ప్రయివేటు ఆటో ఫైనాన్షియర్లు తమ అక్రమ వ్యాపారంతో ఆటో డ్రైవర్లను నిలువు దోపిడీ చేసేందుకు ఉచిత ఆటో పర్మిట్లను అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపింది. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ.. 12 ఏళ్లుగా ప్రయివేటు ఆటో ఫైనాన్షియర్ల అరాచకాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. కాలం చెల్లిన పాత ఆటోలను తుక్కుగా మర్చి ఆ పర్మిట్లపై కొత్త ఆటో కొనుగోలు చేస్తూ ఆర్టీఐ నిబంధనలను ఉల్లంగిస్తూ కోట్ల రూపాయలు అక్రమంగా వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. నేటికి సుమారు 80 వేల ఆటో పర్మిట్లు ఫైనాన్సియర్ల దగ్గర ఉన్నాయని, ఆటో షోరూం ధర రూ.2 లక్షల 70 వేలకు ఉంటే ఫైనాన్షియర్లు ఆటో డ్రైవర్లకు రూ.5 లక్షలకు అమ్మి మధ్యలో రూ.2 లక్షల 30 వేలు అదనంగా లాగుతున్నారని వివరించారు. తమను శాశ్వత రుణగ్రస్తులుగా మర్చి వందల కోట్ల వ్యాపారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫైనాన్స్ సంస్థల నుంచి అప్పులు తీసుకొని ఆటోలను కొనుగోలు చేసిన డ్రైవర్లు కిస్తీలు చెల్లించలేకపోతున్నారని, దీంతో ఫైనాన్స్ సంస్థలు ఆటోలను స్వాధీనం చేసుకుని ఆ పర్మిట్లను మరో డ్రైవరుకు కట్టబెట్టి సొమ్ము చేసుకుంటున్నాయని చెప్పారు. నిరుద్యోగాన్ని రూపుమాపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఉచిత ఆటో పర్మిట్ల జారీకి జీఓ జారీ చేసిందని, ఆటో ఫైనాన్షియర్లు ఈ జీఓను అడ్డుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఉచిత ఆటో పర్మిట్లను అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వారి కార్యాలయాలను వేలాది మంది ఆటో డ్రైవర్లతో ముట్టడిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జెఎసి నేతలు ఎస్ అశోక్ (ఎఐటియుసి), అజయ్‌బాబు (సిఐటియు), వి మారయ్య, మహేష్ (బిఆర్‌టియు), వి ప్రవీణ్, లింగంగౌడ్ (టియుసిఐ), ఎంఎ సలీం, రఫీక్ (యుటిఎడిడబ్ల్యుఎ), తిరుమలేష్, సిహెచ్ జంగయ్య, ఎం శ్రీనివాసు పాల్గొన్నారు.

బేగంపేట విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

- తనిఖీలు.. ఫేక్ కాల్‌గా గుర్తింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయానికి బాంబు బెదిరింపు కాల్ రావడం కలకలం రేపింది. బుధవారం ఉదయం బేగంపేట్ విమానాశ్రయంలో బాంబు ఉన్నట్టు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్, ఈ-మెయిల్ వచ్చింది. దాంతో అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు సిబ్బంది బాంబ్ స్క్వాడ్‌కు సమాచారం ఇవ్వగా.. వెంటనే పోలీసులు డిజాస్టర్ సిబ్బందితో అక్కడకు చేరుకుని ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. చివరికు విమానాశ్రయంలో ఎలాంటి బాంబు లేదని.. అది ఫేక్ కాల్‌గా గుర్తించారు. కాల్ చేసిన నెంబర్ ఆధారంగా ఆగంతకుడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అనంతరం దీనిపై విమానాశ్రయంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఉన్నతాధికారుల సమీక్ష సమావేశం జరిగినట్టు సమాచారం.

సాహిత్య భోజుడు గోన బుద్ధారెడ్డి

ప్రజాశక్తి - కల్చరల్

తెలుగులో తొలిసారిగా వాల్మీకి సంస్కృత రామాయణాన్ని రంగనాథ రామాయణం పేరిట అనువదించిన వారు గోన బుద్ధారెడ్డి అని శాసన మండలిలో ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. అయన సాహిత్య భోజుడుగా నాటి కాలం గుర్తింపు పొందారు అని చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళా వేదికపై గానసభ నిర్వహిస్తున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా గోన బుద్ధారెడ్డి యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధు సూదనాచారి మాటాడుతూ బుద్ధా రెడ్డి పదమూడవ శతాబ్ది వారు అని కాకతీయ ప్రభువులకు సామంత రాజు రాయచూర్ పరిగణ ను పాలించారని వివరించారు. తెలుగు సాహిత్యం విశిష్ట పెంచిన ఇట్టి వారి గురించి నేటి తరాలు తెలియజేసేందుకు గానసభ చేస్తున్న సేవ మీడియా సహసకారం అభినంద నీయమన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జయ రాములు మాట్లాడుతూ ఆంధ్ర మహా భారత రచన చేసిన తిక్కన సమకాలీకు డు బుద్ద రెడ్డి అని రాణి రుద్రమ దేవి సమకాలికుడు ఐన గోన గన్నారెడ్డి కుమారుడు అని తెలిపారు. సరళమైన తెలుగులో బుద్ధరెడ్డి రాసిన ఉడత సాయం సీతాన్వేషణం ఒక నాడు పాఠాలుగా ఉండేవి అని గుర్తు చేశారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించారు.

పోరాటాల ఫలితమే గడువు పొడిగింపు

- ఎన్‌పిఆర్‌డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు అందిస్తున్న సహాయ పరికరాల దరఖాస్తు గడువును ఈ నెల 27 వరకు పొడిగించిందని ఆ సంఘం పేర్కొంది. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో 18 వరకే గడువు ఉండడం వల్ల అనేక మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. గడువు పెంచాలని టివిసిసి చైర్మన్, ప్రభుత్వ కార్యదర్శి, డైరెక్టర్లకు వినతిపత్రాలు అందజేశామనీ, జిల్లా స్థాయిలో కలెక్టర్లకు కు వినతి పత్రాలిచ్చామని తెలిపారు. 17న వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించామని గుర్తు చేశారు. గడువు పొడగించేందుకు కృషి చేసిన టివిసిసి చైర్మన్ ముత్తినేని వీరయ్య, వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి శైలజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పోరాటంలో పాల్గొన్న వికలాంగులకు ధన్యవాదాలు తెలిపారు.

కుంటయ్య కుటుంబానికి అండగా ఉంటాం

- మాజీ మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుంటయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కెటిఆర్

సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మాజీ ఎంపిటిసి కర్కబోయిన కుంటయ్య కుటుంబానికి అండగా ఉంటామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ హామీ ఇచ్చారు. కుంటయ్య సోమవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. బుధవారం జిల్లా ఆస్పత్రిలో కుంటయ్య మృతదేహానికి కేటీఆర్ నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎసిబి విచారణ జరుగుతున్నప్పుడు తన కోసం హైదరాబాద్ వచ్చి ధైర్యం చెప్పిన కుంటయ్య అదే రోజు రాత్రి ఆత్మహత్యాయత్నం చేసుకోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే పార్టీ నేతలను పంపి ఆయనను కాపాడుకునేందుకు తమ వంతు ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదన్నారు. కుంటయ్య ఇద్దరు పిల్లల చదువులు, వారి వివాహాలు, ఇతర సమస్యలు పరిష్కరించే బాధ్యత తనదేనని కేటీఆర్ భరోసా కల్పించారు. కుంటయ్య కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

అనంతరం కుంటయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామానికి తరలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల పహారా మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. కుంటయ్య మృతి పట్ల చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, మాజీ జడ్‌పి చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య సంతాపం తెలిపారు. అంత్యక్రియల్లో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లు సెటిల్మెంట్ల అడ్డాలుగా మారాయి - కెటిఆర్

రాష్ట్రంలో పోలీస్ స్టేషన్లు సెటిల్‌మెంట్లకి అడ్డాలుగా మారుతున్నాయని కెటిఆర్ ఆరోపణలు చేశారు. అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారిపైనే కేసులు నమోదు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పిన విధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తనకు న్యాయం చేయాలని కుంటయ్య ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా తిరిగి అతనిపైనే కేసు పెట్టడం అమానుషమని అన్నారు. కుంటయ్యకు జరిగిన అన్యాయంపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. భూతగాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోవడం మంచిది కాదని సూచించారు. తాము అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో కాంగ్రెస్ నాయకుల మాదిరిగా దిగజారి ప్రవర్తించలేదన్నారు.

సినీ హీరో సుమన్ వ్యాఖ్యలు అర్థరహితం : ఐద్వా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమ్మాయిల డ్రెస్ సెన్స్ గురించి సినీ హీరో సుమన్ వ్యాఖ్యలు అర్థరహితమని, ఆ మాటలని వెంటనే వెనక్కి తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హీరో సుమన్ ఓ టీవీ ఛానల్‌కి వాయిస్ ఇస్తూ అమ్మాయిల డ్రస్సుల గురించి చేసిన వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయని తెలిపారు. సొసైటీలో ఒక ప్రతిష్ట కలిగిన వ్యక్తులు ఇలా మాట్లాడితే..మహిళపట్ల చులకన భావం ఇంకా పెరుగుతుందని దని గుర్తు చేశారు. మహిళలు ఏ రకమైన డ్రెస్సులు వేసుకోవాలనేది వారి సౌలభ్యం, ఇష్టా ఇష్టాలను బట్టి ఉంటుందని తెలిపారు. వైవిధ్యమైన దేశంలో అభిరుచులు వేర్వేరుగా ఉండవని పేర్కొన్నారు. అందాల పోటీల పేరుతో మహిళలను అంగడి సరుకుగా మారుస్తున్న వైనాన్ని హీరో సుమన్ తప్పుపట్టకపోవటం విడ్డూరంగా ఉందని తెలిపారు. పెట్టుబడి దారుల సరుకుల ఉత్పత్తి, వాటి మార్కెట్ కోసం ఇస్తున్న వ్యాపార ప్రకటనల్లో దేశీయ సాంప్రదాయం, సంస్కృతి ఎక్కడ ఉందో చెప్పాలని ప్రశ్నించారు. వాటిని ప్రోత్సహిస్తున్న విధానాలను ప్రశ్నించకుండా మహిళలను తప్పుపట్టడం తగదని హితవు పలికారు. సుమన్ మహిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వాసాలమర్రిని కెసిఆర్ గాలికొదిలేశారు

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు : మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి కెసిఆర్ ప్రతిష్టాత్మకంగా దత్తత తీసుకున్న వాసాలమర్రి గ్రామాన్ని గాలికొదిలేశారని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఆ గ్రామంలోని అర్హులైన ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్టు తెలిపారు. వారికి మంజూరు పత్రాలను గురువారం అందజేస్తామని తెలిపారు. కేసీఆర్ చేతిలో మోసపోయిన ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు వెళ్లేందుకు వీలుగా రోడ్డు విస్తరణ చేయడంతోపాటు దానికి ఇరువైపులా ఉన్న ఇండ్లను కూల్చివేసి పేదలకు నిలువ నీడ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లు కోల్పోయి బాధితులు తాత్కాలికంగా గుడిసెలు, టెంట్లు వేసుకుని నివసిస్తున్నారని తెలిపారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం అక్కున చేర్చుకున్నదని గుర్తు చేశారు. సిఎం ఆదేశాల మేరకు వాసాలమర్రి గ్రామంలో సర్వే నిర్వహించి లబ్దిదారులను గుర్తించామని పేర్కొన్నారు. అర్హులైన 205 మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్టు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా బండ సోమారం, సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని విభలాపూర్‌లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించనున్నట్టు మంత్రి తెలిపారు.

మైరావణ నవలకు కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం

- రచయిత ప్రసాద్ సూరాడ హర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాను రచించిన మైరావణ నవలకు కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం రావడం పట్ల రచయిత ప్రసాద్ సూరాడ హర్షం వ్యక్తం చేశారు. ఈ నవలకు యువ పురస్కారం (తెలుగు) దక్కింది. ఈ నవల ప్రచురణకర్త ఛాయ పబ్లికేషన్స్. పురస్కారం దక్కిన సందర్భంగా ప్రసాద్ సూరాడ, "తెలుగు సాహిత్యంలో రికార్డు మాత్రంగానైనా నా జాతి జనుల కతలు, వెతలు మిగలాలని నేను చేసిన ఓ ప్రయత్నం "మైరావణ - మైలిపిల్లి మైరావుడి వీరగాథ" అని తెలిపారు. పురస్కారం తాను మరిన్ని రచనలు చేయడానికి ఉత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు. తనను ప్రోత్సహించిన పెద్దలందరికీ , తన పుస్తకాలను అచ్చు వేసిన ఛాయకు, మోహన్ బాబుకు, అరుణాంక్ లతకీ, సోలోమోన్ విజయ్ కుమార్‌కు, వెంకట్ సిద్దారెడ్డి, మహి బెజవాడలతో పాటు పాఠకులకు, తనను ఎంపిక చేసిన జ్యూరీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పిఎస్‌హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాలి

- విద్యాశాఖ సంచాలకులకు టిఎస్‌పిటిఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పది వేల పిఎస్‌హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాలని టిఎస్‌పిటిఎ డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ, ప్రధాన కార్యదర్శి ఆర్ రోహిత్‌నాయక్ బుధవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. 65 వేల మంది ప్రాథమిక ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తూ భాషా పండితులకు పది వేల పోస్టులను మంజూరు చేసి వారికే ఉద్యోగోన్నతుల ద్వారా కట్టబెట్టారని తెలిపారు. గత ప్రభుత్వం ప్రాథమిక ఉపాధ్యాయులకు పది వేల పిఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేస్తామంటూ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. దాన్ని అమలు చేయకుండా దగా చేసిందని తెలిపారు. ఆ నష్టాన్ని నిరోధించడానికి సిఎం రేవంత్‌రెడ్డి పదివేల పిఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేసి ఉద్యోగోన్నతులను కల్పిస్తామంటూ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చి ఉద్యోగోన్నతులను కల్పించి ప్రాథమిక ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.

బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వకుంటే భారీగా నామినేషన్లు : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే గ్రామ గ్రామాన వందలాది నామినేషన్లు వేయిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ప్రతీ వార్డులో, పంచాయతీలో వందలాది నామినేషన్లు దాఖలు చేయిస్తామని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ ఢిల్లీకి వెళ్లడంలో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన సిఎం రేవంత్ రెడ్డి ఒక్క సారి కూడా బిసి బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీతో చర్చించకపోవడం దారుణమని విమర్శించారు. ఢిల్లీకి వెళ్లే ముఖ్యమంత్రుల్లో రేవంత్ రెడ్డికి గిన్నీస్ రికార్డు నమోదు ఖాయమని ఎద్దేవా చేశారు. బిసి బిల్లు కోసం తెలంగాణ వికసిత్ యాత్ర పేరిట బిజెపి యాత్ర చేస్తామనడం విడ్డూరంగా ఉందని అన్నారు. బిసి బిల్లుకు మద్దతివ్వకుండా ఎన్ని యాత్రలు చేసినా బిజెపిని ప్రజలు నమ్మరని తెలిపారు.

బిసి బిల్లు కోసం జూలై 17న పెద్ద ఎత్తున రైల్ రోకో కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేసిన ఎమ్మెల్సీ కవిత... జూలై 16, 17, 18 తేదీల్లో ప్రయాణాలు పెట్టుకున్నవాళ్లు వాయిదా వేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాము పిలుపునిచ్చిన రైల్ రోకో కార్యక్రమానికి ఆయా కుల సంఘాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు వస్తోందని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, సంఘాలు కూడా తెలంగాణ జాగృతి ఉద్యమానికి మద్దతిస్తున్నాయని వివరించారు.

గోదావరి జలాలపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. వృథా అవుతున్న గోదావరి నీటిని పొలాలకు మళ్లించుకోవాలన్నది కేసీఆర్ ఆలోచించి తుపాలకులగూడెం వద్ద నుంచి గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టు చేపట్టాలని వాదించారని అన్నారు. దీని వల్ల తెలంగాణలోని సగం తెలంగాణ జిల్లాలకు గోదావరి నీరు పుష్కలంగా లభించే అవకాశం ఉంటుందని వివరించారు. పోలవరం నుంచి లింకేజీ ప్రతిపాదనను గతంలోనే జగన్ తెస్తే కేసీఆర్ వ్యతిరేకించారని గుర్తుచేశారు.

తెలంగాణ ప్రాజెక్టులకు చంద్రబాబు వ్యతిరేకం కాదని ఏపి మంత్రి నిమ్మల రామా నాయుడు చెప్పడం విడ్డూరంగా ఉందని కవిత ఎద్దేవా చేశారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే తెలంగాణ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా లేఖలు రాశారని ఎండగట్టారు. ఏపీ జలదోపిడిని నివారించే విషయంలో సిఎం రేవంత్ రెడ్డి పేపర్ టైగర్ గా మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టులో భాగంగా 150 టిఎంసిల సామర్థ్యంతో బొల్లాపల్లి వద్ద భారీ రిజర్వాయర్ నిర్మించి నల్లమల అడవిని ముంచేసే కుట్ర చేస్తున్నారని తెలిపారు. దీనిపై తెలంగాణ జాగృతి తరపున న్యాయపోరాటం చేస్తామని ప్రకటించారు. "ముఖ్యమంత్రి బొల్లాపల్లి రిజర్వాయర్ కట్టకుండా అడ్డుకోండి. అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని సిఎం డిమాండ్ చేయాలి" అని వ్యాఖ్యానించారు.

ఆపరేషన్ కగార్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఈ మారణకాండను ఆపి మావోయిస్టులతో చర్చలు జరపాలన్నారు. ఎన్‌కౌంటర్‌లో తెలంగాణకు చెందిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి మరణించడం పట్ల ఎమ్మెల్సీ కవిత సంతాపం తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.